RNI.NO. TGBIL/26/A0701

# తొలిప్రభ

తెలుగు దినపత్రిక

WWW.toliprabha.com

హైదరాబాద్ | బుధవారం 26.08.2026 | సంపుటి:1 | సంచిక:169 | పేజీలు:6 | వెల:రూ.5

manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890

| | | |
|---|---|---|
| 24K | ₹1,66,950 | 10 Gram |
| 22K | ₹150,100 | 10 Gram |
| Silver | ₹ 2,51,900 | 1Kg |



# సర్కార్ భూమికి ఎసరు!

**రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ జాగాపై రియల్ మాఫియా కన్ను**

- కొంగరకుర్దు 'ఏ' సర్వే నంబర్ 289లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ?
- భూముల ధరలకు రెక్కలు రావడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు.. అడ్డగోలుగా కబ్జాలు
- అర కిలోమీటర్ మేర ప్రైవేట్ వెంచర్ కు దారి
- కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే నిర్మాణం
- భూములు విక్రయించాలని స్థానిక రైతులపైనా ఒత్తిడి
- రంగారెడ్డి జిల్లాలో రెచ్చిపోతున్న రియల్ మాయగాళ్లు
- ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన కరువు
- భూమి సరిహద్దులను తక్షణమే సర్వే చేయాలని డిమాండ్

**తొలిప్రభ, ప్రత్యేక ప్రతినిధి**

భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ మాఫియా ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములు ఎక్కడ కనపడితే అక్కడ అక్రమంగా ఆక్రమిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ప్రైవేటు వెంచర్లు వేస్తూ పక్కనే ఉన్న సర్కార్ భూములకు ఎసరు పెడుతున్నారు. రాజకీయ నాయకుల మిగతా 2లో



## దేశీయ సంస్థలకే మిస్సైల్ టెక్నాలజీ!

- బదిలీకి ఆమోదం తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- అర్హత కలిగిన భారతీయ కంపెనీలకు అవకాశం

4



## ప్రియుడి కారుపై 3,400 ముద్దులు!

- 24 గంటల్లో 55 లక్షలకు పైగా వ్యూస్
- వైరల్ వీడియోతో పోలీసుల దృష్టిలో పడిన జంట
- కారు యజమానికి రూ.5,500 జరిమానా

4

## కొండా సురేఖ, చిన్నారెడ్డిపై

# వేటు తప్పదా?!

**నివేదిక సిద్ధం చేసిన క్రమశిక్షణ కమిటీ**

- పీసీసీ, ఏఐసీసీకి సమర్పణ
- పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలను సహించొద్దని నిర్ణయం
- వ్యక్తుల కంటే పార్టీనే ముఖ్యమన్న కమిటీ
- కొండా సురేఖ వివరణపై కమిటీ అసంతృప్తి
- చిన్నారెడ్డికి పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని అభిప్రాయం
- నేతలపై చర్యలకు అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం



**తొలిప్రభ, హైదరాబాద్:**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందేనని రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తేల్చినట్లు సమాచారం. క్రమశిక్షణ లేకుండా మాట్లాడే నేతలను ఉపేక్షిస్తే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. వ్యక్తుల కంటే పార్టీనే ముఖ్యమని స్పష్టం చేస్తూ నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నివేదికను పీసీసీ, ఏఐసీసీకి సమర్పించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సైతం కొండా సురేఖ అంశంపై ఇక ఎవరూ మాట్లాడొద్దని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం. అన్ని విషయాలను అధిష్ఠానం చూసుకుంటుందని, నేతలు నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మిగతా 2లో



## మూసీ ప్రాజెక్టుపై భూసేకరణ వేగవంతం చేయాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై స్పష్టమైన విధానం ఉండాలి
- ఫేజ్-2 పనులకు త్వరగా టెండర్లు పిలవాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**తొలిప్రభ, హైదరాబాద్:**

మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధానం రూపొందించాలని సూచించారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి మిగతా 2లో

## అమెరికాలో మనోళ్ల దరఖాస్తులు 15 శాతం డౌన్!

- అంతర్జాతీయ విద్యార్థుల నమోదులోనూ భారీ క్షీణత
- వలస విధానాలు కఠినతరం కావడంతో తగ్గుతున్న ఆసక్తి
- 40 వేల అమెరికా ఉద్యోగాలపై ప్రభావం పడే అవకాశం

2



నిషేధిత జాబితా నుంచి

## భూములను వెంటనే తొలగించాలి

- తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- 22ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- కుత్బుల్లాపూర్‌లో 22ఏ బాధితుల సమావేశంలో హరీశ్‌రావు

2

## ఫీజు బకాయిలు విడుదల చేయాల్సిందే..

- అప్పటి దాకా పోరాటం కొనసాగుతుంది
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- ముగిసిన 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' దీక్ష
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు
- ఎంపీ ఈటల రాజేందర్



**తొలిప్రభ, హైదరాబాద్:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేపట్టిన 'ఫీజుల బకాయిబీజేపీ లడాయి' దీక్ష ముగిసింది. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ నిమ్మరసం ఇచ్చి ఆయనతో దీక్ష విరమింపజేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన దీక్ష మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. దీక్ష విరమణ సమయంలో వైద్యులు మిగతా 2లో

## సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ సస్పెన్షన్

- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యంపై ఉన్నతాధికారుల ఆగ్రహం
- ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆరోపణలు
- విచారణ అనంతరం సీఐ ముత్తు యాదవ్‌పై చర్యలు
- మూడు వారాల క్రితమే బాధ్యతలు చేపట్టిన సీఐ
- సుమంత్‌పై హత్యాయత్నం కేసు.. ముగ్గురు అరెస్టు
- సుమంత్ డ్రైవర్ కూడా పోలీసుల అదుపులో

2



# సర్కార్ భూమికి ఎసరు!

**తరువాయి భాగం**

అండదండలు, అధికారుల ప్రోద్బలం పుష్కలంగా ఉండడంతో రియల్ మాఫియా తమను ఎవరూ ఏం చేయలేరనే ధీమాతో రెచ్చిపోతోంది. తాజాగా మహేశ్వరం మండలం కొంగర కలాన్ పరిధిలో రియల్ మాఫియా తన కబ్జా పడగలు విప్పింది. కొంగర కుర్దు 'ఏ' సర్వే నంబర్ 289లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిలో సుమారు 10 ఎకరాల మేర ఆక్రమణలకు గురవుతున్నట్లు స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.



**ప్రైవేటు వెంచర్ కోసం సర్కార్ భూమి**

ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మిస్తున్న రేడియల్ రహదారి ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని, సమీపంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రాకపోకల సౌకర్యం కల్పించేందుకు ఏకంగా ప్రభుత్వ భూమిలోనే దారి వేస్తున్నారు. సుమారు 10 మీటర్ల వెడల్పుతో దాదాపు అర కిలోమీటర్ మేర రాత్రింబవళ్లు మట్టి తరలిస్తూ భారీ యంత్రాలతో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేదా అనుమతులు లేకుండానే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నప్పటికీ, సంబంధిత రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భూములను అమ్మాలంటూ రైతులపై బెదిరింపులు..**

మరోవైపు ఈ రహదారి నిర్మాణానికి అనుకూలంగా తమ సొంత భూములను కూడా విక్రయించాలని, లేదంటే లీజుకైనా ఇవ్వాలని రియల్ ఎస్టేట్ నిర్వాహకులు స్థానిక రైతులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న రైతులను రకరకాలుగా భయాందోళనలకు గురిచేస్తూ, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమ భూములను కాపాడుకోవడానికి, రియల్ మాఫియా బెదిరింపుల నుండి రక్షణ పొందడానికి రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

**కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే..**

విశేషమేమిటంటే ఈ ఆక్రమణల వ్యవహారం ఏజెన్సీ ప్రాంతంలోనో లేదా దూర ప్రాంతంలోనో కాకుండా, సాక్షాత్తు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరుగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ కార్యాలయం పక్కనే రూ. 100 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి కరిగిపోతున్నా, ప్రైవేటు ప్రయోజనాల కోసం దర్జాగా వాడేస్తున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిరసన తెలుపుతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**ప్రజావాణిలో వినతులు ఇచ్చినా..**

ఈ అక్రమ రహదారి నిర్మాణం మరియు భూ ఆక్రమణలపై స్థానిక రైతులు జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజావాణి కార్యక్రమంలో పలుమార్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆక్రమణలను అడ్డుకోవడానికి అధికారులు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అసలు సర్వే నంబర్ 289లోకి ప్రైవేటు వ్యక్తులు ఏ అధికారంతో ప్రవేశించారు, నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది ఎవరు, ప్రభుత్వ భూమిని ఎవరి ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు అన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**సమగ్ర విచారణ జరిపి భూమిని కాపాడాలి**

ఫ్యూచర్ సిటీ విస్తరణ నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో సర్కార్ భూములపై రియల్ కన్ను పడింది. అధికారులు తక్షణమే స్పందించి కొంగర కుర్దు 'ఏ' సర్వే నంబర్ 289 పరిధిలో అధికారికంగా డిమార్కేషన్ నిర్వహించి ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా జరుగుతున్న రహదారి నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, ప్రభుత్వ భూమికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, కబ్జాకు పాల్పడిన రియల్ మాఫియాపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కొండా సురేఖ, చిన్నారెడ్డిపై
# వేటు తప్పదా?!

**తరువాయి భాగం**

సూచించినట్లు తెలుస్తోంది. వ్యక్తుల స్థాయి పెద్దదని తప్పు చేసినా చూసీచూడనట్లు వదిలేస్తే పార్టీకి నష్టం జరుగుతుందని క్రమశిక్షణ కమిటీ భావించినట్లు సమాచారం. కాంగ్రెస్, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోకపోతే పార్టీలో క్రమశిక్షణ మరింత దెబ్బతింటుందని పలువురు నేతలు కమిటీకి చెప్పినట్లు తెలుస్తోంది. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసిన సమయంలో హెచ్చరించినా కొండా సురేఖ వైఖరిలో మార్పు రాలేదని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం.

**సురేఖ వివరణపై అసంతృప్తి**

కేబినెట్ సభ్యురాలిగా ఉన్న కొండా సురేఖ ప్రభుత్వానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిటీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదంటూ సురేఖ ఇచ్చిన వివరణను కమిటీ అసంబద్ధంగా భావించినట్లు సమాచారం. కుమార్తె వ్యాఖ్యలతో సంబంధం లేదని భావిస్తే, బాధ్యత గల మంత్రిగా వెంటనే వాటిని ఖండించాల్సిందని కమిటీ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలను కమిటీ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు ఆ వ్యాఖ్యలను ఖండించినప్పుడు, తనపై కుట్ర జరుగుతోందంటూ వారిని గుర్తించాలని కొండా సురేఖ కోరడంపైనా కమిటీ పరిశీలన జరిపినట్లు తెలుస్తోంది. పార్టీ, ముఖ్యమంత్రిని అప్రతిష్ఠపాలు చేసేలా వ్యాఖ్యలు చేయడం వెనుక ఎవరైనా ఉన్నారా అనే అంశాన్ని ఎందుకు గుర్తించలేదని కొందరు నేతలు ప్రశ్నించినట్లు సమాచారం.

**చిన్నారెడ్డిపైనా చర్యలకు సిఫార్సు**

చిన్నారెడ్డి కూడా కేబినెట్ హోదాలో ఉండి పార్టీ టికెట్లను అమ్ముకున్నారంటూ చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పదవిలో కొనసాగేందుకు ఆయనకు నైతిక అర్హత లేదని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. గతంలో రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన ఆయన ఇతర నేతలకు ఆదర్శంగా ఉండాల్సి ఉండగా, ఇలా వ్యవహరించడం సరికాదని కమిటీ భావించినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇతర నేతల విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని క్రమశిక్షణ కమిటీ భావించినట్లు సమాచారం. నివేదికను పీసీసీ, ఏఐసీసీకి సమర్పించిన తర్వాత అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా సీఎంను కలిసినట్లు మల్లు రవి వెల్లడించారు. ఈ భేటీలో పార్టీ పరిణామాలపైనా చర్చించినట్లు సమాచారం.

# మూసీ ప్రాజెక్టుపై భూసేకరణ వేగవంతం చేయాలి

**తరువాయి భాగం**

ఆలయానికి వెంటనే బిడ్లు ఆహ్వానించాలని సూచించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలు పొందడంపై మునిసిపల్ కమిషనర్లు దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయాల్సిందే..

**తరువాయి భాగం**

రామచందర్‌రావును పరీక్షించగా బీపీ 90/60కి పడిపోయినట్లు తెలిపారు. దీక్ష విరమించినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని రామచందర్‌రావు ప్రకటించారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక బాధ్యత ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలోని సుమారు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఉన్నతాధికారులుగా ఎదగాలని తల్లిదండ్రులు కలలు కంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని హెచ్చరించారు. ఫీజు బకాయిలు అందక కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మరోవైపు ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఫీజు బకాయిలు అడిగితే బెదిరింపులకు పాల్పడటం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రామచందర్‌రావు చేపట్టిన దీక్షకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించిన ఆయన.. భవిష్యత్తులో చోటుచేసుకునే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ సస్పెన్షన్

**తొలిప్రభ, హైదరాబాద్:**

మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ సస్పెండ్ అయ్యారు. ఎఫ్ఐఆర్ నమోదులో అలసత్వం, బాధితుడు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయడంలో జాప్యం జరిగిందన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన అనంతరం సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ముత్తు యాదవ్ మూడు వారాల క్రితమే జూబ్లీహిల్స్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా పోలీసుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో సీఐపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ వ్యవహారం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఓ వ్యాపారిని రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇనుప రాడ్లతో దాడి చేశారన్న ఆరోపణలపై సుమంత్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ కోసం గాలింపు కొనసాగుతోంది. కేసు దర్యాప్తులో భాగంగా సుమంత్ డ్రైవర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెల్లాపూర్‌లోని సుమంత్ నివాసం ఎదుట అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఇతర వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. సుమంత్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసులో అరెస్టయిన నిందితులను విచారిస్తూ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఇదే సమయంలో ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి బాధ్యులైన పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

# నిషేధిత జాబితా నుంచి భూములను వెంటనే తొలగించాలి

- **తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి**
- **22ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి**
- **భూముల విలువ పడిపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు**
- **ప్రజల సమస్య పరిష్కరించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు**
- **కుత్బుల్లాపూర్‌లో 22ఏ బాధితుల సమావేశంలో హరీశ్‌రావు**

**తొలిప్రభ, హైదరాబాద్:**

ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించి, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. పద్మారావునగర్ ఫేజ్ 1 కాలనీకి చెందిన విజయ్ అనే వ్యక్తి 58 ఏళ్ల క్రితమే లే అవుట్ అయిన భూమిని కొనుగోలు చేశానని, ఇప్పుడు దానిని నిషేధిత జాబితాలో చేర్చడం ఏమిటని ప్రశ్నించారని హరీశ్‌రావు తెలిపారు. తాను రెండో కొనుగోలుదారుడినని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములను ఇప్పుడు 22ఏలో చేర్చడం ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని విమర్శించారు. 22ఏ నుంచి భూములను తొలగించేందుకు కొందరు ఏజెంట్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. విల్లాకు రూ.30 వేలు, ఫ్లాట్‌కు రూ.30 వేలు చెల్లిస్తే ప్రభుత్వంలో పని పూర్తవుతుందని కొందరు చెబుతున్నారని పేర్కొన్నారు. 22ఏలో చేర్చడం వెనుక కమీషన్ల వ్యవహారం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భూమిని 22ఏలో ఎందుకు చేర్చారో తెలుసుకునేందుకు తహసీల్దార్‌ను సంప్రదిస్తే ఆర్డీవోను కలవాలని, అక్కడికి వెళ్తే కలెక్టర్‌ను అడగాలని చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. చివరకు ఓ బ్రోకర్ కలిసి డబ్బులు చెల్లిస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పినట్లు వివరించారు. దీంతో ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తిరిగి తొలగించినా, భవిష్యత్తులో మళ్లీ జాబితాలో చేరతాయేమోనన్న భయంతో ఎవరైనా కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ వ్యవహారం వల్ల ఆస్తుల విలువ పడిపోయి లక్షలాది మంది నష్టపోతున్నారని అన్నారు. ప్రజలను ఇంతగా ఇబ్బంది పెట్టడానికి కారణమైన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

# పదేళ్లలో యూపీఐ సంచలనం!

**తొలిప్రభ, న్యూఢిల్లీ:**

దశాబ్దం క్రితం ప్రారంభమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో చారిత్రక మైలురాయిగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ ప్రస్తుతం దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక సమ్మిళితానికి వెన్నెముకగా మారిందని తెలిపారు. పదేళ్లలో యూపీఐ సాధించిన విస్తృతి, ప్రజల్లోకి చేరిన తీరు ప్రతి భారతీయుడు గర్వపడే అంశమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన యూపీఐ ప్రస్తుతం కోట్లాది మంది రోజువారీ చెల్లింపులకు ప్రధాన సాధనంగా మారింది. 201617లో యూపీఐ ద్వారా 1.78 కోట్ల లావాదేవీలు జరగగా.. 202526 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే పదేళ్లలో లావాదేవీల సంఖ్య దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. ఇదే సమయంలో లావాదేవీల విలువ రూ.0.07 లక్షల కోట్ల నుంచి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. భారత్‌లో విజయవంతమైన యూపీఐ ఇప్పుడు అంతర్జాతీయంగానూ విస్తరిస్తోంది. ప్రస్తుతం 11 దేశాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. భూటాన్, నేపాల్, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్, ఖతార్, గ్రీస్, మాల్దీవులు తదితర దేశాల్లో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చు. దీంతో విదేశాల్లోని భారతీయులు, ఆయా దేశాల వినియోగదారులకు సరిహద్దులు దాటి డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం లభించింది.

### అమెరికాలో మనోళ్ల
# దరఖాస్తులు 15 శాతం డౌన్!

**తొలిప్రభ, నేషనల్ డెస్క్**

అమెరికాలో వలస విధానాలు కఠినతరం కావడంతో అక్కడి విద్యాసంస్థల్లో చేరేందుకు దరఖాస్తు చేస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. గత ఏడాదితో పోలిస్తే 202526లో భారతీయ విద్యార్థుల దరఖాస్తులు 15 శాతం తగ్గినట్లు 'కామన్ యాప్' నివేదిక వెల్లడించింది. వచ్చే విద్యా సంవత్సరంలోనూ ఈ తగ్గుదల కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. 202627 విద్యా సంవత్సరానికి అండర్‌గ్రాడ్యుయేట్ ప్రవేశాల కోసం మొత్తం దరఖాస్తులు పెరిగినప్పటికీ.. అంతర్జాతీయ విద్యార్థుల దరఖాస్తులు 10 శాతం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. భారత్ నుంచి వచ్చే దరఖాస్తుల్లో 15 శాతం క్షీణత నమోదైంది. ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి కూడా దరఖాస్తులు తగ్గినట్లు తెలిపింది. కఠిన వీసా నిబంధనలు, విధానాల్లో అనిశ్చితి కారణంగా 2026లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదు 1.1 లక్షల వరకు తగ్గవచ్చని మరో నివేదిక అంచనా వేసింది. దీనివల్ల అమెరికాలో సుమారు 40 వేల ఉద్యోగాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. 202425 విద్యా సంవత్సరంలో అమెరికాలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు వివిధ కోర్సుల్లో నమోదయ్యారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**సంకల్ప విద్యాపీఠ్ పాఠశాలలో వనమహోత్సవం...**

**తొలిప్రభ. పరిగి :**

పరిగి:పరిగి పట్టణంలోని సంకల్ప విద్యాపీఠ్ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**మొక్కలు నాటిన రామ్మోహన్ రెడ్డి:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు.

**రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ:**

పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని కాపాడటంలో వనమహోత్సవ కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పరిగి గాంధీ చౌక్ లో రోడ్డుపై వ్యక్తి మృతి

**బెల్ట్ షాపులపై కౌన్సిలర్ తీవ్ర ఆగ్రహం....**

**తొలిప్రభ. పరిగి:**

పరిగి: పరిగి గాంధీ చౌక్ లో రోడ్డుపై వ్యక్తి మృతి చెందడం కలకలం రేపింది. మృతుడి ని చిగురల పల్లి గ్రామానికి చెందిన ముస్తఫా గా గుర్తించారు.

**బెల్ట్ షాపులపై ఆగ్రహం:**

ఈ ఘటనపై కౌన్సిలర్ మీది గడ్డ శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయాలు..

తెల్లవారుజామున 3 గంటలకే మళ్లీ షాపులు తెరుస్తున్నారంటూ ఆరోపణలు.

హనుమాన్ టెంపుల్ సమీపంలోనూ నిత్యం మద్యం విక్రయాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ ఆరోపణ. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నలు. బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.






## ప్రతి ఇంట మొక్క.. పచ్చని ఊరే లక్ష్యం: సర్పంచ్ రషీద్


**తొలిప్రభ – ఊరుకొండ**

ఊరుకొండ మండలం ఊరుకొండ పేట గ్రామంలోని పాఠశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎల్పీఓ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి హాజరై వన మహోత్సవం ప్రాధాన్యత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణపై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రషీద్ మాట్లాడుతూ "ప్రతి ఇంట మొక్క.. పచ్చని ఊరే లక్ష్యం" అని అన్నారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నరసింహ, ఉపసర్పంచ్ రేపని శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు

**తొలిప్రభ, కడ్తాల్ :**



కల్వకుర్తి బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జన్మదినం సందర్భంగా కడ్తాల్ మాజీ జడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ హైదరాబాద్‌లోని జైపాల్ యాదవ్ నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. పదవిలో ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసే గొప్ప జన హృదయ నేత అని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, నిరుపేదలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ కొండంత అండగా నిలిచారని గుర్తుచేశారు. జైపాల్ యాదవ్ ఆయురారోగ్యాలతో నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కడ్తాల్ మండల అధ్యక్షుడు పరమేష్, ఆమనగల్ మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్ రావు, డైరెక్టర్ జోగు వీరయ్య, సర్పంచ్ ప్రియా రమేష్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నాయకులు మంగళపల్లి నరసింహ, కోట్య, గోపాల్, పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## ఊరుకొండలో ఘనంగా వన మహోత్సవం

**తొలిప్రభ – ఊరుకొండ**

ఊరుకొండ, ఆగస్టు 25: వన మహోత్సవం సందర్భంగా ఊరుకొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరుకొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డీఎస్పీ, ఊరుకొండ మండలం ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కల్వకుర్తి, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.



## దోమ మండల కేంద్రంలో ఉచిత మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

**సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి చొరవ**

**తొలిప్రభ. పరిగి :**

దోమ:దోమ మండల కేంద్రమైనటువంటి దోమ గ్రామంలోనికి గాని బ్యాంకుకు గాని దోమ లో జరిగే సంతకు గాని ఇతరత్రా పనులకు సంబంధించి మీ సేవలో గాని మినీ బ్యాంకుకు గాని ఏదైనా పని నిమిత్తం దోమ మండల కేంద్రానికి వచ్చిన వివిధ గ్రామ ప్రజలకు, మహిళా సోదరీమణులకు, వేరే గ్రామ ప్రజలకు ఇప్పటివరకు దోమ గ్రామంలో ఉచిత మరుగుదొడ్లు లేకపోవడం చాలా బాధాకరమని గ్రామ సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి ఈ విషయాన్ని తన బాధ్యతగా తీసుకొని తక్షణమే వాటి పనులు పూర్తి కావాలని దోమ గ్రామ యువకులకు సూచించడం జరిగింది.అందుకుగాను యువకులు స్థలాన్ని పరిశీలించి పనులు ప్రారంభించడం జరిగింది.

**ప్రజల హర్షం:**

మండల కేంద్రానికి వచ్చే మహిళలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, సర్పంచ్ శివకుమార్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల గ్రామస్తులు, మహిళా సోదరీమణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కుల్కచర్లలో మండల స్థాయి సమీక్ష సమావేశం.. పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**రైతులకు కందులు, పెసర్ల విత్తనాల పంపిణీ....**

**తొలిప్రభ. పరిగి :**

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో సమీక్షించారు ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

**రైతులకు విత్తనాల పంపిణీ:**

అనంతరం రైతులకు కందులు, పెసర్ల విత్తనాలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

## ఆపదలో అండగా... మానవత్వంలో ముందడుగు

**తొలిప్రభ, కడ్తాల్ :**

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు కడ్తాల్ మండల బీసీ సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ 9వ వార్డు సభ్యుడు మాదారం గణేష్ గౌడ్. గతంలో జరిగిన ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేపని యాదయ్య కుటుంబానికి తన వంతు బాధ్యతగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టాల్లో ఉన్న వారికి తోడుగా నిలవడం, అవసరమైన సమయంలో చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గణేష్ గౌడ్ పేర్కొన్నారు. తాము అందించే సహాయం చిన్నదైనా బాధిత కుటుంబానికి ఎంతో భరోసానిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు వరికుప్పల రాజు, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నార్లకంటి శేఖర్, చిన్నం వెంకటేష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి మైసమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు



**రూ.29.43 లక్షల ఆదాయం**

**తొలిప్రభ, కడ్తాల్ :**

రంగారెడ్డి జిల్లా మైసిగండి శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 148 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ.29,43,801 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ డి. రాజేశ్వర్, ఫౌండర్ ట్రస్టీ లక్ష్మి శిరోళి, ఈఓ మఠం వీరేశం, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఆర్.పీ. భాస్కర్, వి. అరుణ్, ఉప ప్రధాన అర్చకుడు మాదారం యాదగిరి, దేవస్థాన సిబ్బంది పి. కృష్ణ, బి. చంద్రయ్య, జి. రాములు, ఎస్. శ్రీనివాసులు, ఎ. వెంకటేష్, ఎ. పత్య నాయక్, హర్షవర్ధన్, బీబీచారి, డీఎస్. శ్రీను, వీజీఎల్ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ ప్రతినిధులు, కెనరా బ్యాంకు సిబ్బంది లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే భావితరాలకు మనుగడ

**రావిచేడ్ సర్పంచ్ గోపాల్**

**తొలిప్రభ, కడ్తాల్ :**

మొక్కల పెంపకంతోనే భావితరాలకు మనుగడ సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు. మంగళవారం వనమహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని భావి తరాలకు అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి చెట్లుగా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.. సకాలంలో వర్షాలు కురవాలన్నా, పర్యావరణ సమతుల్యత కొనసాగాలన్నా మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు తమ ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బాలకృష్ణ, రమేష్, సాయి కుమార్, రాజయ్య, దేవేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి నాయక్ తదితరులున్నారు.



కడ్తాల్: మొక్కలు నాటుతున్న సర్పంచ్ గోపాల్



కడ్తాల్: మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మీ నరసింహారెడ్డి

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎల్.ఎన్. రెడ్డి

**తొలిప్రభ, కడ్తాల్ :**

కల్వకుర్తి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసన సభ్యుడు జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైపాల్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జైపాల్ యాదవ్ ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కరీంపేట్ కార్యదర్శి పై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన ఉపసర్పంచ్

**తొలిప్రభ, మానకొండూర్**

పంచాయతీ కార్యదర్శి తమను అవమాన పరిచారని కరీంపేట్ గ్రామ ఉపసర్పంచ్ చింతం రాజేశం మంగళవారం ఎంపీడీవోకు ఓ ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రాజేశం మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని, కరీంపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శి తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనం మహోత్సవ కార్యక్రమానికి ఉప సర్పంచ్ గా గ్రామ ప్రజలకు సేవలందిస్తున్న తనను ఆహ్వానించకుండా గ్రామపంచాయతీ కార్యదర్శి అవమానించాడని శంకరపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని పి అనితకు లిఖితపూర్వకంగా పంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదు చేసినట్లు ఉపసర్పంచ్ రాజేశం తెలిపారు.



కడ్తాల్: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో సుజాత

## గ్రామాల్లో వన మహోత్సవం

**తొలిప్రభ, కడ్తాల్ :**

కడ్తాల్ మండలంలోని ఏక్వాయిపల్లి, న్యామతాపూర్ తో పాటు పలు గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఏక్వాయిపల్లి గ్రామంలో సర్పంచ్ కర్ణాకర్ గౌడ్, ఉపసర్పంచ్, అధికారులు పాల్గొని మొక్కలు నాటగా, న్యామతాపూర్ గ్రామంలో సర్పంచ్ సుగుణ దేవిసింగ్, ఉపసర్పంచ్ మహేష్, అధికారులు వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని తెలిపారు. గ్రామాల్లో నాటిన మొక్కలను నిరంతరం సంరక్షించి వాటిని పెద్ద చెట్లుగా పెంచేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మైసిగండి తీజ్ మొలకల పండుగకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వానం

**తొలిప్రభ, కడ్తాల్ :**

కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో నేడు నిర్వహించనున్న తీజ్ మొలకల పండుగకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గ్రామ సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరా సింగ్ నాయక్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పండుగకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, తులసీరాం నాయక్, రాము నాయక్, సాయి కుమార్ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో తీజ్ మొలకల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




## పచ్చదనం భావితరాలకు మోక్షం

- **త్రివేణి వనంలో మొక్కలు నాటిన విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు.**
- **వన సందర్శనీ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్.**

**తొలిప్రభ,జహీరాబాద్**

జహీరాబాద్ నియోజకవర్గంలో త్రివేణి వనంలో విద్యా భారతి విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కలు నాటే క్రమంలో అధికారులు పచ్చదనం భావితరాలకు మోక్షమని తద్వారా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాలు పెట్టుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఆర్డీఓ, ఎమ్మార్వో,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాం సుందర్, మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, విద్యా భారతి ఎండి కృష్ణారెడ్డి, విద్యార్థులు, రాజకీయ ప్రజా ప్రతినిధులు, తదితర స్కూల్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

## ప్రియుడి కారుపై 3,400 ముద్దులు!

**తొలిప్రభ, నేషనల్ డెస్క్**

సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావాలనే ఉద్దేశంతో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన ఓ యువతి తన ప్రియుడి కారుపై ఏకంగా 3,400 ముద్దు ముద్రలు వేసింది. ఆ కారుతో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా.. 24 గంటల్లోనే 55 లక్షలకు పైగా వీక్షణలు వచ్చాయి. అయితే ఈ వీడియో చివరకు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి వెళ్లడంతో ప్రియుడికి ఊహించని షాక్ ఎదురైంది. విదేశాల్లో వైరల్ అవుతున్న ముద్దుల కార్ల వీడియోల తరహాలో ఈ జంట కూడా వినూత్నంగా వీడియో చేయాలని భావించినట్లు తెలుస్తోంది. యువతి కారుపై లిప్‌స్టిక్‌తో వేలాది ముద్దు ముద్రలు వేసింది. అనంతరం వాటిని వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. వీడియో భారీగా వైరల్ కావడంతో ట్రాఫిక్ పోలీసుల దృష్టికి వెళ్లింది. వైరల్ అయిన వీడియోలోని కారు నంబర్ ప్లేట్ ఆధారంగా పోలీసులు యజమానిని గుర్తించారు. వాహన నిబంధనలను ఉల్లంఘించినందుకు కారు యజమాని ఆదిత్యకు రూ.5,500 జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా కారుపై ఉన్న వేలాది ముద్దు ముద్రలను పోలీస్ స్టేషన్‌లోనే అతనితో తుడిపించి కారు శుభ్రం చేయించారు. సామాజిక మాధ్యమాల్లో లైకులు, వీక్షణల కోసం చేసే ఇలాంటి వినూత్న ప్రయోగాలు చివరకు ఇబ్బందులకు దారితీయొచ్చని ఈ ఘటన చెబుతోంది. వాహనాల బాహ్య రూపాన్ని నిబంధనలకు విరుద్ధంగా మార్చి రోడ్లపైకి తీసుకురావడం సమస్యలకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరించారు.



శంకరపట్నం లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పిఎస్ మండలాధ్యక్షులకు నియామక పత్రం అందజేస్తున్న ఇన్చార్జి సీనియర్, ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, మండల అధ్యక్షుల నియామకం

**ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడుగా మహేష్ మాదిగ**

**తొలిప్రభ, మానకొండూర్**

ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి శంకరపట్నం మండల శాఖ నియామకం చేసినట్లు మండల ఇన్చార్జ్ దేవనూరి రవీందర్ మాదిగ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాదిగ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం, ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఎంఎస్పి మండల శాఖ సమావేశాన్ని మొలంగూర్ శివారులోని లక్ష్మీప్రసన్న గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా కోడూరి మహేష్ మాదిగ, ఎంఎస్పి మండల అధక్షు నాత్రి సమ్మయ్య, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా చల్లూరి సతీష్ మాదిగ, ఎంఎస్పి ఆడెపు బిక్షపతి మాదిగ, తో పాటు మరికొంతమందిని వివిధ విభాగాలలో నియామకము చేసి, శంకరపట్నం మండలం ఎంఆర్పిఎస్ ఎంఎస్పి మండల సంఘాలను సమావేశంలో ఏకగ్రీవంగా నియామకం చేసి నియామక పత్రాలు అందజేసినట్లు రవీందర్ మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్ర మాదిగ, ఇంజన్ వెంకటస్వామి, ఆడెపు నరసయ్య, దండు అంజయ్య, దండు వరలక్ష్మి కనుకుంట్ల శ్రీనివాస్, తోపాటు వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశీయ సంస్థలకే మిస్సైల్ టెక్నాలజీ!

**తొలిప్రభ, న్యూఢిల్లీ:**

రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు బదిలీ చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దీంతో అర్హత కలిగిన దేశీయ సంస్థలు ఈ సాంకేతికతలను ఉపయోగించి భారత్‌లోనే క్షిపణి వ్యవస్థలను ఉత్పత్తి చేసే అవకాశం లభించనుంది. రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను అర్హత కలిగిన భారతీయ సంస్థలకు బదిలీ చేయనున్నారు. ఇందుకు కంపెనీలు నిర్దేశిత అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ సంస్థల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితమైన సాంకేతికతను అర్హత ఉన్న దేశీయ పరిశ్రమలు ఉత్పత్తిలోకి తీసుకురావడానికి ఈ నిర్ణయం మార్గం సుగమం చేస్తుంది. రక్షణ తయారీలో దేశీయ సామర్థ్యాలను పెంచడంతో పాటు విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీఆర్‌డీఓ సాంకేతికతను దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయడం ద్వారా రక్షణ ఉత్పత్తి రంగంలో ప్రైవేటు, ఇతర భారతీయ సంస్థల భాగస్వామ్యం మరింత పెరగనుంది. పరిశోధన, అభివృద్ధి నుంచి భారీ స్థాయి ఉత్పత్తి వరకు దేశీయ సామర్థ్యాలను విస్తరించేందుకు ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే భారత్ స్వదేశీ హైపర్‌సోనిక్ ఆయుధాల అభివృద్ధిపై దృష్టి సారించింది. హైపర్‌సోనిక్ గ్లైడ్, క్రూయిజ్ క్షిపణి సాంకేతికతలపై డీఆర్‌డీఓ పరిశోధనలు కొనసాగిస్తోంది. అత్యంత వేగంతో ప్రయాణించే ఈ తరహా ఆయుధ వ్యవస్థలు భవిష్యత్తు రక్షణ అవసరాల్లో కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేశీయ పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలను మరింత పెంచాలని కేంద్రం భావిస్తోంది. దేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 201314తో పోలిస్తే 2024 25 నాటికి స్వదేశీ రక్షణ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు తెలిపింది. 2024 25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తి విలువ అంతకుముందు ఏడాదితో పోలిస్తే 15.6 శాతం పెరిగినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి.

# వంద కోట్ల క్లబ్‌లోకి రవితేజ ‘ఇరుముడి’



మాస్ మహారాజా రవితేజ ‘ఇరుముడి’ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. దర్శకుడు శివ నిర్వాణ డైరెక్షన్‌లో వచ్చిన ఈ డివోషనల్ ఫ్యామిలీ డ్రామా మూవీ వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.100 కోట్ల వసూళ్లతో ర్యాంపేజ్ క్రియేట్ చేసింది. ప్రేక్షకుల నుంచి వచ్చిన అపూర్వ ఆదరణతో ఈ చిత్రం ఈ ల్యాండ్ మార్క్‌ను అందుకుందని మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సినిమాకు వస్తున్న పాజిటివ్ టాక్‌తో థియేటర్ల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. భక్తితో కూడిన బలమైన కథాంశానికి రవితేజ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ తోడవడంతో ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ గ్రాండ్ సక్సెస్‌తో ‘ఇరుముడి’ టీమ్ ఎంతో ఉత్సాహంగా ఉంది. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించగా బేబీ నక్షత్ర, సాయి కుమార్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు జీవీ.ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేశారు.

కన్నడ క్యూట్ బ్యూటీ రుక్మిణి వసంత్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. చెన్నైలో జరిగిన ఒక ఈవెంట్‌లో పాల్గొన్న ఈ భామ, అక్కడ అభిమానుల నుంచి లభించిన అపారమైన ప్రేమకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ క్షణాలను గుర్తుచేసుకుంటూ 'డ్యాష్ అండ్ డాట్' బ్రాండ్‌కు చెందిన రెడ్ డ్రెస్‌లో దిగిన కిల్లర్ పిక్స్‌ను ఇన్స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో నెటిజన్లు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు..
"చెన్నై.. నిన్నటి తీపి జ్ఞాపకాల నుంచి నేను ఇంకా బయటకు రాలేకపోతున్నాను. నిన్న స్టేజ్ పైకి వెళ్లినప్పుడు మీరు చూపించిన ప్రేమ నన్ను ఎంతగానో మురిపించింది. నిజంగా చాలా కృతజ్ఞురాలిని" అంటూ రుక్మిణి ఒక ఎమోషనల్ నోట్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె ధరించిన 'క్రిమ్సన్ రెడ్ టై-అప్' హై-లో మ్యాక్సీ డ్రెస్, దాని బ్యాక్ కటౌట్ డిజైన్ ఆమె గ్లామర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. ఇక 2019లో 'బీర్బల్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి వసంత్, 'సప్త సాగరదాచే ఎల్లో' పార్ట్-A, పార్ట్-B సినిమాలతో భారీ పాపులారిటీ సాధించారు. ఈ చిత్రానికి గానూ ఫిలింఫేర్ క్రిటిక్స్ బెస్ట్ నటి అవార్డును కూడా గెలుచుకున్నారు. ఆ తర్వాత 'బాణదారియల్లి', 'బఘీర', 'భైరతి రణగల్' వంటి చిత్రాలతో అలరించారు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'తో తెలుగులోకి, 'ఏస్', 'మాధరాసి' చిత్రాలతో తమిళంలోకి, అల్టిమేట్ హిట్ 'కాంతార: చాప్టర్ 1'తో పాన్ ఇండియా స్థాయిలో మెప్పించారు. ప్రస్తుతం రుక్మిణి వసంత్ టాలీవుడ్, శాండల్‌వుడ్ ఇండస్ట్రీలలో క్రేజీ ఆఫర్లతో దూసుకుపోతున్నారు. రాకింగ్ స్టార్ యష్ సరసన నటిస్తున్న భారీ చిత్రం 'టాక్సిక్' త్వరలోనే విడుదలకు సిద్ధమవుతుండగా, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో కూడా ఈమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా 'NP51' చిత్రంతో మలయాళంలోకి కూడా అడుగుపెడుతున్నారు.తన సహజమైన అభినయంతో, క్యూట్ లుక్స్‌తో సౌత్ ఇండియాలో వరుస అవకాశాలు అందుకని స్టార్ హీరోయిన్‌గా మారుతున్నారు రుక్మిణి వసంత్. తాజాగా ఆమె పంచుకున్న ఈ రెడ్ డ్రెస్ కిల్లింగ్ స్టిల్స్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచాయి..



# రెడ్ డ్రెస్‌లో రుక్మిణి వసంత్ కిల్లింగ్ స్టిల్స్!

## "ఇడుపు కాయితం" నుంచి 'శ్రీలత సాంగ్' ప్రోమో రిలీజ్

ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు హీరో ప్రియదర్శి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయనకు బర్త్ డే విశెస్ తెలియజేస్తూ "ఇడుపు కాయితం" సినిమా నుంచి 'శ్రీలత సాంగ్..' ప్రోమో రిలీజ్ చేశారు. కొత్తగా పెళ్లయిన జంట శ్రీలత, శ్రీనివాస్ మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్ గా ఈ పాటను చిత్రీకరించారు. ఈ సాంగ్ ప్రోమో ఎలా ఉందో చూస్తే - 'ఓ శ్రీలత శ్రీలత శ్రీలత నువ్వు సిన్నబోకే నా శ్రీలత, ఓ శ్రీలత శ్రీలత శ్రీలత నువ్వు సిన్నబోకే నా శ్రీలత, శ్రీలత శ్రీలత శ్రీలత ఈ శ్రీనివాసుడే నీ జత' అని ఆకట్టుకునేలా సాగుతుంది. త్వరలో ఈ పాట ఫుల్ వెర్షన్ రిలీజ్ చేయనున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మంచి మెలొడీ ట్యూన్ తో ఈ పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. "ఇడుపు కాయితం" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో దర్శక నిర్మాతలు షేర్ చేసుకోనున్నారు.





# దేశీయ సంస్థలకే మిస్సైల్ టెక్నాలజీ!

శ్రీలంకతో కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఆధిపత్యం కొనసాగుతోంది. భారత్ 503/9 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయగా.. మూడో రోజులో రెండో సెషన్లో శ్రీలంక 181/7 స్కోరుతో నిలిచింది. లంక ఇంకా 322 పరుగులు వెనుకబడి ఉంది. టీమిండియా పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ మూడు కీలక వికెట్స్ పడగొట్టి.. లంకను ఒత్తిడిలో పడేశాడు. ఈరోజు మీడియాతో ప్రసిద్ధ్ మాట్లాడుతూ తన ప్రణాళికలను వెల్లడించాడు. ఈ క్రమంలో పిచ్, స్లిప్ క్యాచింగ్, తన బౌలింగ్ విధానం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. బౌలర్లు బాగా బౌలింగ్ చేస్తే సరిపోదని, స్లిప్ ఫీల్డర్లు క్యాచ్ అందుకోవడం మరింత ముఖ్యం అని పేర్కొన్నాడు.

‘శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉదారాను ఔట్ చేసిన సమయంలో బంతి పిచ్‌పై కొద్దిగా ఆగి, స్వల్పంగా సీమ్ అయింది. బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుంది. యశస్వి జైస్వాల్ అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. ప్రాక్టీస్‌లో ఫీల్డింగ్‌పై టీమ్ ఎంతో శ్రమిస్తోంది. అందుకు తగిన ఫలితం ఈ క్యాచ్ రూపంలో వచ్చింది. బౌలర్ ఎడ్జ్ అయ్యేలా బంతిని సరైన ప్రదేశంలో వేయడం ఎంత ముఖ్యమో.. వచ్చిన అవకాశాన్ని స్లిప్ ఫీల్డర్లు క్యాచ్ అందుకోవడం కూడా అంతే ముఖ్యం. జట్టు ఈ విషయంలో బాగా శ్రమిస్తోంది. మ్యాచ్‌లో పెద్ద విషయాల కంటే చిన్న చిన్న అంశాలను సరిగ్గా చేయడమే విజయానికి దోహదపడుతుంది’ అని ప్రసిద్ధ్ చెప్పుకొచ్చాడు.

‘నా బౌలింగ్‌లో దూకుడుకు ప్రాధాన్యం ఇస్తా. అయితే బౌలర్ దూకుడు అనేది మాటలు లేదా శరీర భాషలోనే కనిపించాల్సిన అవసరం లేదు. నేను బంతులు వేసే విధానంలో అది కనిపిస్తుంది. పిచ్‌పై ఏమాత్రం స్పందన లేకపోయినా బౌలర్ దృష్టి మాత్రం మారకూడదు. ఎక్కడ బంతి వేయాలనుకుంటున్నాడనే దానిపైనే దృష్టి ఉండాలి. పూర్తి శ్రమతో అనుకున్న ప్రాంతాల్లో బౌలింగ్ చేయడమే నా లక్ష్యం. నేను ఒకే లెంగ్త్‌లో బౌలింగ్ చేసే బౌలర్‌ని కాదు. పిచ్ స్వభావాన్ని బట్టి బౌలింగ్ లెంగ్త్‌ను మార్చుకుంటా. ఇందుకోసం విశ్లేషకులు, కోచ్‌లతో కలిసి చర్చించి.. ఏ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటా’ అని ప్రసిద్ధ్ వెల్లడించాడు. దేశానికి ఆడక ముందు తనకంటూ ఒక సహజ లెంగ్త్ ఉండేదని.. కానీ అంతర్జాతీయ స్థాయిలో టీమ్‌కు అవసరమైన ఏ లెంగ్త్‌లోనైనా బౌలింగ్ చేయడం నేర్చుకోవాల్సి ఉంటుందని ప్రసిద్ధ్ పేర్కొన్నాడు.



# వైభవ్ సూర్యవంశీ స్పిన్ మ్యాజిక్.. ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు..!

ఈ ఐపీఎల్ సూపర్ స్టార్ వైభవ్ సూర్యవంశీ అంటేనే బ్యాటింగ్.. తన బ్యాట్‌తో ఎన్నో రికార్డులు సృష్టించడమే కాదు.. అవార్డుల పంట కూడా పండింది.. అయితే, తన బ్యాట్‌తోనే కాదు.. బాల్‌తోనూ మ్యాజిక్ చేయగలను అంటున్నాడు.. ఈ యూనివర్సల్ బేబీ బాస్.. దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌లో 15 ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ బంతితో అదరగొట్టాడు. ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగిన వైభవ్.. నార్త్ ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు. నార్త్ ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 111 పరుగులకే ఆలౌట్ కాగా, ఈస్ట్ జోన్ 467 పరుగుల భారీ స్కోరు చేసింది. దీంతో నార్త్ ఈస్ట్ జోన్ ఫాలోఆన్ ఆడాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆ జట్టు వరుసగా వికెట్లు కోల్పోతూ ఒత్తిడిలో పడింది. ఎడమచేతి వాటం స్లో ఆర్థడాక్స్ స్పిన్నర్ అయిన వైభవ్ 27వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చి అద్భుత ప్రదర్శన చేశాడు. ఓవర్ రెండో బంతికి కిషన్ లింగ్దోను 25 పరుగుల వద్ద పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ఐదో బంతికి ఇమ్లివాటి లెమ్టూర్‌ను ఔట్ చేసి ఒకే ఓవర్‌లో రెండో వికెట్ సాధించాడు. మొత్తంగా వైభవ్ మూడు ఓవర్లు బౌలింగ్ చేసి 11 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అయితే బ్యాటింగ్‌లో మాత్రం పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 6 బంతులు ఎదుర్కొని 8 పరుగులు చేసి ఔట్ అయిన విషయం విదితమే.. ఇక, నార్త్ ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 102 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. దీంతో ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం కొనసాగుతోంది.